

## ఉచిత వైద్య సేవలు అభినందనీయం

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** గ్రామీణ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ఆదివారం నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో గ్రామపంచాయతీ, లైన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ (గెలాక్సీ) సంయుక్త ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో, నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి, ఉప సర్పంచ్ ఓర్సు మంజుల శ్రీను,నల్లగొండ లయన్స్ క్లబ్ గవర్నర్ మదన్ మోహన్ రేపాల, లయన్స్ క్లబ్ గెలాక్సీ అధ్యక్షుడు జూలకంటి మల్లారెడ్డి సెక్రటరీ వెంకట్ రెడ్డిపాల్గొన్నారు.

## భర్తను సుత్తితో కొట్టి చంపిన భార్య



**ప్రజాపక్షం/గుండాల :** భర్తను సుత్తితో కొట్టి కిరాతకంగా హతమార్చిన సంఘటన శనివారం అర్ధరాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గుండాల మండల కేంద్రానికి చెందిన మారదబోయిన బిక్షం (64) భార్య ఉప్పలమ్మ ఇద్దరు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారిద్దరు తరుచూ కొడవ పడేవారని అదే క్రమంలో శనివారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య గొడవ ముదరడంతో ఆవేశానికి లోలైన భార్య ఉప్పలమ్మ పక్కనే ఉన్న సుత్తితో బిక్షం తలపై బలంగా కొట్టడంతో బిక్షం అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా యాదాద్రి డిఎస్పి శ్రీనివాస్ నాయుడు, సిఐ శంకర్‌గౌడ్, ఎస్ఐ తేజం రెడ్డిలు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

### కస్తూర్బా పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంటశాలను పరిశీలించారు.తనిఖీ అనంతరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులతో కలసి గణిత శాస్త్రంపై చర్చించారు. వారికి ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకొని, కొన్ని అంశాలను స్వయంగా బోధించారు. విద్యార్థులతో సాన్నిహిత్యంగా మాట్లాడి చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో సమావేశమై కష్టపడి చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రోత్సహించారు. సమయపాలన, క్రమశిక్షణ పాటిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచనలు ఇచ్చారు.ఈకార్యక్రమంలో చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో యుగంధర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** మండలంలోని చర్లగూడెం గ్రామంలో అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు గడ్డం మారయ్య,సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ మీసాల రమేష్ , దాతల సహకారంతో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం కలగడం తనకు గొప్ప గౌరవమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, సామాజికవేత్త అంబేద్కర్ వాది డాక్టర్ జాడీ రాజు, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రతీ న్యాయవాదికి చట్టాలపై అవగాహన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** న్యాయవాదులు తమ విధులను కోర్టులో, సమాజంలో బాధ్యతాయుతంగా నిర్వంచాలని న్యాయవాద పరిషత్ జాతీయ అధ్యక్షులు కే. శ్రీనివాస మూర్తి సూచించారు.ఆదివారం పట్టణం లోని షాలిని రెసిడెన్సీ లో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధి గా శ్రీనివాస మూర్తి హాజరై మాట్లాడుతూ న్యాయవాదులు తమ విధులను కోర్టులో, సమాజంలో బాధ్యతాయుతంగా నిర్వహించి యువ న్యాయవాదులు నిరంతరం కేసులను చదువుతూ సీనియర్ న్యాయవాదుల సలహాలు సూచనలతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతీ న్యాయవాది చట్టాల మీద పూర్తి అవగాహన తో ఉండాలని అంతే గాక జాతీయ భావం, పేద ప్రజల పట్ల సేవాభావం కూడా కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి సునీల్, కేంద్ర కమిటీ సభ్యులు మేరెడ్డి నర్సింహా రెడ్డి, కవిత, గౌరీష్ జి, సోమంచి వెంకటేశ్వర్లు ,రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి చొక్కాల నాగరాజు పాల్గొన్నారు.



## మునుగోడులో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

### ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

### ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు దేశానికి ఆదర్శమని వెల్లడి



**ప్రజాపక్షం/మునుగోడు:** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని లక్ష్మీదేవిగూడెం సమీప దుబ్బకాలువ రోడ్డులో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన, నైపుణ్యాధారిత విద్య అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడులో 2,500 మంది విద్యార్థుల కోసం సమగ్ర సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం శుభపరిణామమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 79 పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోందని, మునుగోడుకు పాఠశాల కేటాయించినందుకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.తన చిన్ననాట అన్ని కులాలు, మతాలకు చెందిన విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకున్న రోజుల్ని గుర్తు చేస్తూ, అదే భావనతో అన్ని వర్గాల నిరుపేద కుటుంబాల పిల్లలు ఒకే తాటిపై చదువుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో ఇతర రా ష్ట్రాలు చేపట్టని విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతి రెడ్డి చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో యుగంధర్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, కాంగ్రెస్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.



## యూరియా యాప్‌ను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి సరిపడా ఎరువు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరెల్లి వెంకటేశ్వర్లు, మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు. ఆదివారం నకిరేకల్ లోని ఎన్.ఆర్. భవన్‌లో రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. యూరియా పంపిణీపై సరైన ప్రణాళిక లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రైతులను ఇబ్బందులకుగురిచేస్తున్నాయని వారు విమర్శించారు. పంటలు పొట్టదశలో ఉండటంతో యూరియా అత్యవసరమని తెలిపారు. యాప్‌లో దరఖాస్తు చేయగానే స్టాక్ లేదని చూపుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. వెంకటయ్య, ఆకుల భాస్కర్, గింజల లక్ష్మి, వెంకటేశ్వర్లు, కృష్ణ, పరమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులు ఉద్యోగులపై చిత్తశుద్ధితో ఉందని వారి ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐఎంఎ ఫంక్షన్ హాల్‌లో ఆత్మకూర్ మండలం ఏవికె తండ పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో అత్యధిక మంది ఉపాధ్యాయులు ఉద్యోగులు కాంగ్రెస్ అభిమానులు ఉన్నారని ఇటీవల జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపులో వారంతా భాగస్వాములయ్యారన్నారు. ప్రభుత్వంతో, ఉన్నతాధికారులతో మాట్లాడి సూర్యాపేట జిల్లా కేంద్రంలో పిఆర్‌టియు భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని అన్నారు. గత 26 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన తంగెళ్ల పద్మ పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. తాను పని చేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉత్తమ విద్య అందించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, నాయకులు తంగెళ్ల వాసుదేవ రెడ్డి, నంద్యాల చౌదరి రెడ్డి పాల్గొన్నారు.

## మార్కెట్‌లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దళారులచే మోసపోకుండా మార్కెట్ యార్డ్‌లోనే అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఈనామ్ 2.0 రైతు రిజిస్ట్రేషన్ నమోదు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి ఫసీయుద్దీన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమలు అవుతున్న ఈనామ్ 1.0 పాత విధానంను నవీకరించి ఈనామ్ 2.0 నూతన విధానంను భారత ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందని వివరించారు. పాత విధానంలో రైతులు వారి యొక్క సరుకులు అమ్ముకునేందుకు మార్కెట్ యార్డుకు వచ్చిన సమయంలో గేట్ ఎంట్రీ నందు రైతు పేరు, ఊరి పేరు, సరుకు వివరములు, బస్తాల సంఖ్య, వాహనం వివరాలు, కమీషన్‌దారుపేరు చెప్పవలసి ఉండేదన్నారు. ఇప్పుడు అమలులోకి వచ్చిన ఈనామ్ కొత్త విధానం నందు కూడా అట్టి వివరములతో పాటు రైతు యొక్క ఫోన్ నంబర్, పుట్టిన తేదీ కొరకు ఆధార్ కార్డు సమర్పించవల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇట్టి విధానం నందు ఒక్కసారి రైతులు వారి యొక్క పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్న యెడల వారు మళ్లీ మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు కనీస వసతులలో భాగంగా ఉదయం ఉచిత అల్పాహారం, మధ్యాహ్నం రూ.5కే భోజనం అందించడం జరుగుతుందన్నారు. మార్కెట్ అభివృద్ధిలో భాగంగా రూ.3కోట్ల 75లక్షలతో షెడ్డు నిర్మాణం, ప్రస్తుతం ఉన్న టాయిలెట్ బ్లాక్లకు అదనంగా స్త్రీ, పురుషులకు వేరువేరుగా టాయిలెట్ బ్లాక్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులకు నిరంతరం మంచినీరు, విశ్రాంతి గదులు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులో అమ్ముకోవాలని కోరారు.

## బుద్ధవనం చేరుకున్న దమ్మ పాదయాత్ర

### ఎమ్మెల్యే జైవీర్‌తో కలిసి ఘనంగా స్వాగతం పలికిన మల్లేపల్లి లక్ష్మయ్య



**ప్రజాపక్షం/నందికొండ:** గౌతమ బుద్ధుని శాంతి సందేశంతో ప్రజలను మేల్కొల్పుతూ సాగిన మూడవ దమ్మయాత్ర ఆదివారం సాయంత్రానికి బుద్ధవనం చేరుకుంది. దమ్మయాత్ర బుద్ధవనం చేరుకున్న సందర్భముగా స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ లతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య దమ్మయాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. బంజారా నృత్యాలతో, కోలాటాలతో, ఒగ్గు కళాకారుల నృత్యాలతో, స్థానికులు, బౌద్ధ అభిమానులు అధిక సంఖ్యలో దమ్మయాత్ర బృందానికి అడుగు అడుగున పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 403 కిలోమీటర్ల పాదయాత్ర తో వచ్చిన థాయిలాండ్, భారతీయ బౌద్ధ భిక్షువులుకు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో బుద్ధవనములోని అశోక ధర్మ చక్రం వద్ద బౌద్ధ భిక్షువుల పాదాలను కడిగారు. థాయిలాండ్ నుండి బౌద్ధ దమ్మయాత్ర ద్వారా తీసుకురాబడిన బుద్ధ ధాతువులను బుద్ధ వనం ప్రధాన ద్వారం నుండి స్థానిక శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్, సిద్ధార్థ లతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బుద్ధ ధాతువులను ఊరేగింపుగా తీసుకువచ్చి మహ స్తూపం లోని ధ్యాన మందిరంలో సందర్శకుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. మహ స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిలను వెలిగించిన అనంతరం ధ్యానం చేశారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ సంఘ థాయిలాండ్ అధ్యక్షులు పర సంగ్ సక్ కోవిడో ప్రధాన బౌద్ధ భిక్కు ఆధ్వర్యంలో థాయిలాండ్ భిక్షువులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భిక్షులతో సుమారు 403 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి బుద్ధవనం చేరుకున్నారన్నారు. థాయిలాండ్ రాజకుటుంబం నుండి మహా థాయ్ ఈ దమ్మయాత్రకు సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధ వనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావు, బుద్ధ వనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, స్థానిక సీఐ శ్రీను నాయక్, ఎస్సై ముత్తయ్య, బౌద్ధాభిమానులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

### బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆ శ్రీరాముడిని ప్రార్థించినట్లు రోడ్డు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం మండలలోని రాములబండ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై గ్రామస్తులతో కలిసి స్వామివారి రథాన్ని స్వయంగాలాగి ప్రారంభించారు.గ్రామంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల సందడి మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్తులంతా ఏకమై ప్రతీ ఏడాది బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సత్సంబంధాలను పెంపొందిస్తాయని తెలిపారు.అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,తహసిల్దార్ పరుశురాం నల్గొండ మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, స్థానిక సర్పంచ్ చామకూరి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

## రాజకీయంగా ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వని వారిని తిరస్కరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆర్యవైశ్యులు ఆత్మ విమర్శ చేసుకోవాలని రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వని వారిని తిరస్కరించాలని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వాసవీభవన్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ఆర్యవైశ్య అభ్యర్థులకు సన్మాన సభలో అఖిల భారత ఆర్యవైశ్య మహిళా నాయకురాలు రాయపూడి భవాని, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు తెడ్ల జవహర్‌బాబు, పందిరి రవీందర్, చిట్యాల మున్సిపల్ ఛైర్మన్ పందిరి గీతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులకు అన్ని రాజకీయ పార్టీల నుంచి సరైన ప్రాధాన్యత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు సాధించిన ఆర్యవైశ్య అభ్యర్థులు పందిరి గీత, గుడిపాటి క్రాంతిన వీన్, మిట్టపల్లి శ్రీదేవికృష్ణయ్యలను ఆర్యవైశ్య సంఘం అసోసియేషన్, వాసవీ క్లబ్ ప్రతినిధులతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రనాయకులు కర్నాటి రమేష్, పట్టణ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భువనగిరి మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర శర్మ ఆశీర్వాదంతో ఆలయ ప్రధాన అర్చకులు నరేందర్ శర్మ నూతనంగా ఎన్నుకోబడిన భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పొత్తంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు మిగతా 33 మంది కౌన్సిలర్లకు వేద ఆశీర్వచనము మేమంటో శాలువా దండతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి దిండిసత్యం, ట్రెజరర్ శ్యాంసుందర్, ఘటాని ప్రోగ్రాం చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమెరికా యుద్ధోన్మాద చర్యలను భారత ప్రభుత్వం కూడా ఖండించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత తనకు తోచిన విధంగా, నచ్చిన విధంగానిర్ణయాలను తీసుకుంటూ ప్రపంచ ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నాడని ఇటీవల టారీఫ్‌లతో పేరుతో తనకు గిట్టని దేశాలను భయపెడుతూ తన దారికి తీసుకవస్తున్నాడని,ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తూ తన మాట వినని దేశాన్ని ఆ దేశం వల్ల ప్రపంచానికి ప్రమాదం ఉందనే సాకును చూపుతూ ఇరాన్‌లాంటి స్వతంత్ర్య దేశాలపై దాడులను చేసి, ఆదే శ అధ్యక్షులనే చంపడం దారుణమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రలో మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం తన మాట వినని, వెనిజులా అధ్యక్షుడని ఆ దేశంపై దాడిచేసి, తన దేశంలోనే తనను కిడ్నాప్ చేసి, అమెరికాకు తీసుకవచ్చి అమెరికా చట్టాల ప్రకారం విచారణ చేసి శిక్ష విధించాలనుకోవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనం అని అన్నారు.

## వేసవికి ముందే అడుగంటుతున్న నాగార్జున సాగర్ రిజర్వాయర్

### డెడ్ స్టోరేజ్ వైపు పరుగెడుతున్న నీటిమట్టం



**ప్రజాపక్షం/నందికొండ:** రాష్ట్రానికి జీవనాడిగా భావించే నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటిమట్టం ఆందోళనకరంగా పడిపోతోంది. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే నిల్వలు గణనీయంగా తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది.కుడి,ఎడమ కాలువల ద్వారా సాగునీటి అవసరాల కోసం నీటి విడుదల నిరంతరం కొనసాగుతుండటంతో రిజర్వాయర్‌లోని నిల్వలు రోజురోజుకు క్షీణిస్తున్నాయి.ఇప్పటికే ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆవిరీభవనం కూడా నీటి తగ్గుదలపై ప్రభావం చూపుతోంది.ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, మే నెల రాకముందే రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని నీటి రంగ నిపుణులు అంచనా వేస్తున్నాయి.డెడ్ స్టోరేజ్‌కు చేరుకుంటే సాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.తాగునీటి అవసరాలను ప్రాధాన్యంగా తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.సాగర్ పరివాహక ప్రాంతాల్లో రైతులు పంటల సాగు,వేసవి పంటల ప్రణాళికలపై అనిశ్చితి నెలకొనే విధంగా ఉందని ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నీటి వినియోగంపై నియంత్రణ,ప్రాధాన్యతల ఆధారంగా విడుదల,ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగం వంటి చర్యలు అత్యవసరమని అధికారులు భావిస్తున్నారు.ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో నీటి పంపిణీపై కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఇక వర్షాకాలం ప్రారంభం వరకు సాగర్ నీటిమట్టం ఎలా ఉండబోతుందన్నదే అందరిలో ఆసక్తి,ఆందోళన కలిగిస్తున్న అంశంగా మారింది.

**రిజర్వాయర్ సమాచారం :** నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గురువారం సాయంత్రానికి 538.30 అడుగులుగా ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు 184.8035 టీఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 2000క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు,ఎస్ఎల్‌బిసి ఏఎంఆర్‌పి ద్వారా 2000క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతూ ఉంది ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి జరగటం లేదు రిజర్వాయర్ కు 19411 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదలవుతుంది.

## ఆలయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** పుస్పూర్ గ్రామ అభివృద్ధికి మరింత వేగం చేకూరుస్తూ భీమన్న ఆలయం నిర్మాణానికి ఈ రోజు భూమి పూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ ఆలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ సీజీఫ్ ద్వారా రూ.25 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు.ఆలయ నిర్మాణాన్ని అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేసి భక్తులకు ఆదర్శవంతమైన ఆలయంగా తీర్చిదిద్దాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.అదేవిధంగా గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా స్పందించిన ఎమ్మెల్యే,ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని ఆయన తెలిపారు. సర్పంచ్ లక్ష్మి నరసయ్య,స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో వంట పనులు చేయించడం సిగ్గుచేటు

### ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్నీ గౌడ్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంట వాడ బాలుర సమీకృత వసతి గృహంలో విద్యార్థులతో వంట పనులు చేయించడం సిగ్గుచేటని అఖిలభారత విద్యార్థి బ్లాక్ జిల్లా ప్రధాన కార్యద ర్శి కనుకుంట్ల సన్నీ గౌడ్ మండిపడ్డారు. ఆదివారం ఉదయం హాస్టల్ ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. హాస్టల్ సిబ్బంది విద్యార్థులను ఉదయం 5 గంటలకే నిద్రలేపి టిఫిన్లు, వంటలు చేయిస్తున్నారని ఆరోపించారు. సరిపడా భోజనం పెట్టకుండా పనులు చేయించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది చెప్పినట్లు చేయకుంటే విద్యార్థులను బెదిరిస్తున్నారని, దీంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరని ప్రశ్నించారు. నిరసన విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.కనుకుంట్ల సన్నీ గౌడ్, ఏఐఎస్ నాయకులు, విద్యార్థులువిద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** కాంగ్రెస ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సికింద్లాపూర్ సర్పంచ్ దొంతిరెడ్డి అరుణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలో మహిళాస్త్రీశక్తి భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానని ఆమె అన్నారు.ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కాశ ఆంజనేయులుచారి, చేగూరి వెంకటేష్‌గౌడ్, అశోక్‌కుమార్‌గౌడ్, లచ్చాగౌడ్ పాల్గొన్నారు.

## 7న ఛలో హైదరాబాద్

### ఇందిరా పార్కు మహావిజ్ఞాపన సభను విజయవంతం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్ర ప్రభుత్వ మెమో 57 రాష్ట్ర హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం కేర్ డిగ్రీ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార మాట్లాడుతూ 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా ఇటీవల రాష్ట్ర హైకోర్టు తీర్పును అమలు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని వ ర్తింపజేయాలనాన్రు. ఇప్పటికే దేశంలోని దాదాపు సగం రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ మెమోను అనుసరిస్తూ పాత పెన్షన్ విధానాన్ని తమ ఉద్యోగులకు వర్తింపజేయాలని, పక్క రాష్ట్రం ఒకే నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో కూడా పాత పెన్షన్‌కు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతుందని మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. ఈనెల 7న ఇందిరా పార్కు దగ్గర మహావిజ్ఞాపన సభను నిర్వహిస్తున్నామని దీనికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల 2003 ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ఉద్యోగ జెఎసి నాయకులు ప్రొఫెసర్ కోదండరాం పాల్గొంటారన్నారు. 2003 ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు కనకపురం రవీందర్, పరమేశ్వర్, శ్రీనివాస్, మాణిక్యం, మోహన్ పాల్గొన్నారు.

## జూదంపై ఉక్కుపాదం

### టాస్క్ ఫోర్స్ దాడుల్లో 9 మంది అరెస్ట్

### 6 మొబైల్ ఫోన్లు, కారు, 5 బైక్లు స్వాధీనం

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజరంపేట్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 28,296 నగదు మరియు 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని వడ్ల ఎల్లం, వంజరి మల్లేశం, ఉసికె దుర్గేష్, బక్క వీరేశం, మహంకాళి ప్రకాష్, గుడాల హరి, పనిముక్కలా రామ్ శశిధర్ గౌడ్, గంగారాం మల్లేశం, జాతీగరి కృష్ణగా పోలీసులు గుర్తించారు. వారిని కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లాలో పేకాట, బెట్టింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తప్పుదారుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై అందించి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



# క్రీడలతో మానసికోల్లాసం

### జిల్లాలో తైక్వాండో క్రీడా పోటీలు అభినందనీయం






**ప్రజాపక్షం/నిజామాబాద్ :** క్రీడా పోటీలతో మానసికోల్లాసం కలుగుతుందని నగర మేయర్ కూరగాయ ఉమారాని అన్నారు. జిల్లాలో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా తైక్వాండో క్రీడా పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు క్రీడాకారులు తమ నైపుణ్యం ప్రదర్శించి జిల్లాకు వన్నె తీసుకరావలన్నారు. ఆదివారం నగరంలోని తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ పవర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీర్ వహజ్ అలీఖాన్, రాష్ట్ర అబ్జర్వర్ ముస్తఫాలు హాజరయ్యారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి రెండవ తైక్వాండో జిల్లా ఛాంపియన్‌షిప్ పోటీలను ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. నగర మేయర్ ఉ మారాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించటం అ భినందనీయమన్నారు. తైక్వాండో వంటి క్రీ డలు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. శిక్షణ తీసుకుంటే శారీరక ధృ ఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. క్రీ డలు ఎంతో ముఖ్యమని ప్రతిరోజు కనీసం గం ట పాటైనా క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడలతో శారీరకంగా కాకుండా మానిసకోల్లాసం కలుగుతుందన్నారు. ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, సీనియర్ వ్యా యామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, జర్నలిస్ట్ క్రీ డాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

## వసతి గృహాల్లో విద్యార్థుల.. సంక్షేమానికి ప్రాధాన్యత

### వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి

**ప్రజాపక్షం / మంచిర్యాల :** సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని బాలుర సమీకృత వసతి గృహంపై వచ్చిన వార్తల నేపథ్యంలో ఆమె ఆదివారం హాస్టల్‌ను సందర్శించారు.భోజన సరఫరా, తాగునీరు, వంటశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.పర్యవేక్షణ లోపం కారణంగానే సౌకర్యాల్లో కొంత అంతరాయం ఏర్పడిందని అంగీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణమే లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టామని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, శుద్ధమైన తాగునీరు అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బందిని కఠినంగా హెచ్చరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సంబంధిత శాఖాధికారులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.



## చేగుంట హత్య కేసును ఛేదించిన పోలీసులు

### డబ్బుల కోసం భార్యను కొట్టి హత్య చేసిన భర్త అరెస్ట్



**ప్రజాపక్షం/రామాయంపేట:** చేగుంటలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. డబ్బుల కోసం భార్యను భర్త హత్య చేసి పారిపోగా ఆదివారం నిందితుడిని రామాయంపేట సర్కిల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను రామాయంపేట సిఐ వెంకటరాజా గౌడ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం 2015లో వరలక్ష్మీ ముఠా త్రిమూర్తులకు రెండో వివాహం జరిగింది. వివాహనంతరం నిందితుడు ఇల్లరికం వచ్చి చేగుంటలో నివాసం ఉంటూ వచ్చాడు. వీరికి దుర్గాప్రసాద్ (10) సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. డబ్బును కాజేయాలన్నా పన్నాగంతో బార్యను ఎలాగై హత్య చేయాలని పథకం పన్ని గత నెల 21న రాత్రి బార్యా, కుమారుడు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న పారతో వరలక్ష్మీ తలపై దాడి చేయగా తీవ్రగాయాలతో ఆమె అక్కడికి అక్కడే మృతిచెందింది. అనంతరం మృతురాలి వద్ద ఉన్న 39.55గ్రాముల బంగారంతో పాటు 5వేల నగదు, సెల్‌ఫోన్ తీసుకొని అన్నవరం పారిపోయాడు. కేసు నమోదు చేసిప్రత్యేక బృందం నిఘా ఏర్పాటు చేసి ఆదివారం ఉదయం చేగుంట బస్టాండ్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి పుస్తెలతాడుతో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాదీనం చేసుకిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును చాకచక్యంగా చేదించిన సిఐ వెంకటరాజాగౌడ్, మెదక్ జిల్లా ఎస్‌పి అభినందించారు.

## టాలెంట్ టెస్ట్‌లో అనన్య రాష్ట్రస్థాయిలో ఫస్ట్



**ప్రజాపక్షం / జన్నారం :** రాష్ట్రస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ పరీక్షలో జన్నారం మండలం కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ఏ. అనన్య మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి కార్యాలయంలో డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా అనన్య మెమెంటో, ప్రశంసా పత్రం, రూ. 3,000 నగదు బహుమతి అందుకుంది. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని కిష్టాపూర్ పాఠశాలలో విద్యార్థిని అనన్యతో పాటు ఆమెకు మార్గదర్శనం చేసిన గైడ్ టీచర్ కొట్టే రాజన్నను, విద్యార్థిని తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇలాంటి ప్రతిభ కనబరచడం గర్వకారణమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రతినిధులు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీ విభాగ అధికారి రామ్ మోహన్, ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, సర్పంచ్ నరేష్, ఉపాధ్యాయులు జాడి మురళి, కమలాకర్, మంగ పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని గాంధీచౌక్ వద్ద వెలసిన మురళీకృష్ణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ ను ఘనంగా సన్మానించారు.ఆలయ అభివృద్ధికి,స్థానిక సమస్యల పరిష్కారానికి అందిస్తున్న సహకారానికి గుర్తింపుగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మేడారం ప్రదీప్ పాల్గొని మాట్లాడుతూ..ప్రజాప్రతినిధులు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ ఆలయాల అభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమని కొనియాడారు.అనంతరం వైస్ చైర్మన్‌ను శాలువాతో సత్కరించి,దైవ ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,వార్డు నాయకులు,స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య




**ప్రజాపక్షం/ఖానాపూర్ :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఎత్తివేసే కుట్రను మానుకొని ,కేంద్ర ప్రభుత్వం ఆపాదించే నాలుగు లేబర్ కోడ్ లని రద్దు చేయాలనీ భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట నగయ్య పేర్కొన్నారు .ఆదివారం ఖానాపూర్ పట్టణ తాపీ మేస్త్రీలు సంఘ భవనంలో మేస్త్రి సంఘం మండల అధ్యక్షత న ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాటలాడుతూ మోడీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తు కోసం గతంలో ఏర్పాటు చేసిన సంక్షేమ,సెస్ చట్టలను ఇప్పుడు అనుసరించే నాలుగు లేబర్ కోడ్ లలో చేర్చి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఎత్తి వేసే కుట్రకు పాల్పడు తుంటే,మరో పక్క కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ బోర్డును ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పుతూ భవన నిర్మాణ కార్మికులను విస్మరిస్తురని,సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను అక్రమంగా ఇతర పథకాలకు తరలిస్తూ వృధా ఖర్చులకు పాల్పడుతున్నారని,కార్మికులు ఎన్నో ఏళ్ల నుండి సంక్షేమ పథకాలను మెరుగుపరచాలని కోరుతుంటే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూన్నారని,కార్మికులకు అందించే పథకాలైన మ్యారేజ్,మెటర్నరీలకు వంటి వాటికీ లక్ష రూపాయల వరకు పెంచాలని,50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి 6000 రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని,సంక్షేమ బోర్డును కాపాడాలని డిమాండ్ చేశారు.ఐఎఫ్టీయు జిల్లా అధ్యక్షుడు సునకారి రాజేష్,ఐఎఫ్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత,మేస్త్రి మండల కార్యదర్శి చిలుకూరి ఇస్తారి,సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు,సోరపాక రాజన్న, బోదాసు చిన్న నరసయ్య,పోశెట్టి కోమటిపల్లి భీమయ్య,దుర్గం లింగన్న,డివిజన్ నాయకులు ఆడేపు గణేష్,ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఉపాలి తదితరులు పాల్గొన్నారు.

## రూ.46 89 కోట్ల.. నిధులు మంజూరు

### ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

**ప్రజాపక్షం/బైంసా :** ఇక గ్రామాల్లో నూతనంగా గ్రామ పంచాయతీ భవనాలు,మహిళ సమైక్య భవనాలు,అంగన్వాడీ కేంద్రాలు,ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడ నిర్మాణాలకు నిధులను ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తన కోటా లో 46 కోట్ల 84 లక్షల 60 వేల రూపాయలనిధులను మంజూరు చేయించారు.దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్‌లకు,నాయకులకు అందించారు.కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.గ్రామానికి పెద్ద మొత్తం లో నిధులు మంజూరైనందుకు ప్రజల్లో హర్షం వ్యక్తమవుతుంది.



## సానుభూతి కోసమే బిఆర్ఎస్ నేతల డ్రామా

### మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్



**ప్రజాపక్షం/ మెదక్ :** మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్, అనుచరులు, గుండాలు ఓట్లు దండుకునేందుకు అరాచకం సృష్టించి కాంగ్రెస్ పార్టీ నాయకులను భయభ్రాంతులకు గురి చేసి దాడులు చేశారని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు, పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, నాయకులు మ్యాడం బాలకృష్ణ తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ సర్కార్, బిఆర్ఎస్ నేతలను అక్రమ అరెస్టులు చేస్తున్నీరని నాటకమాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి అర్ధరాత్రి ఇంటిపై దాడి చేస్తే పోలీసు కేసులు కావా లని ప్రశ్నించారు. పోలీసులు బిఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తే సింపతి కోసం డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. సిద్దిపేట రాజకీయ ప్లాను మెదక్ లో అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గొడవలను, దాడులను ప్రోత్సహించడం లేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నేతలు ఎన్ని చేసిన ఎన్నికల్లో ప్రజలు ప్రజా సేవకె పట్టం కట్టారని తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు చేస్తున్న అభివృద్ధిని చూస్తే ప్రజలు ఓటేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ మంత్రి హారీష్ రావులు ప్రజాస్వామ్య బద్దంగా ప్రశ్నించాలి తప్ప ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకోమని, దాడులకు, ప్రతి దాడులు తప్పవని నరేష్ గౌడ్ హెచ్చరించారు. లా అండ్ ఆర్డర్ కాపాడే పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు. కౌన్సిలర్లు మన్సూర్ అహ్మద్, హరిత గౌడ్, గంట సంపత్, శశాంక్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ నారాయణ గౌడ్, నాయకులు సాయిరాం, అంజాద్, దయాసాగర్, ఉమర్ తో పాటు తదితరులు ఉన్నారు.

## ఆనందంలో దళారులు.. అయోమయంలో రైతులు

**ప్రజాపక్షం / రెబ్బెన :** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి 28తో అధికారికంగా ముగించడంతో పత్తి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి అమ్ముకునే అవకాశం లేకపోవడంతో ఇకపై దళారులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వర్షాల ప్రభావంతో తగ్గిన దిగుబడి, కిసాన్ కపాస్ యాప్‌తో చిక్కులు

ఈ ఏడాది పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి ఇవ్వలేదు. పత్తి చేతికొచ్చే సమయంలో కురిసిన భారీ వర్షాల వల్ల కాయలు కుళ్లిపోవడం, పొలాల్లో తేమ శాతం పెరగడం వంటి సమస్యలు ఎదురయ్యాయి. దీంతో పత్తి రంగు మారి నాణ్యత తగ్గింది. ఈ కారణంతో సిసిఐ అధికారులు కొనుగోలులో కఠిన నిబంధనలు అమలు చేస్తూ చాలా చోట్ల పత్తిని తిరస్కరించారని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ కపాస్ యాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతులకే కొనుగోలు ప్రక్రియ చేపట్టడం గ్రామీణ రైతులకు ఇబ్బందిగా మారింది. ఎక్కువ మంది రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేకపోవడంతో యాప్‌లో వివరాలు నమోదు చేయలేకపోయారు. ఫలితంగా మద్దతు ధర దక్కక ప్రైవేట్ వ్యాపారులకే పత్తి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### క్వింటాల్‌కు రూ.5 వేలే.. గడువు పొడిగించాలని డిమాండ్

సిసిఐ కొనుగోళ్లు ముగియడంతో ప్రైవేట్ వ్యాపారులు మార్కెట్‌ను నియంత్రిస్తున్నారు. నాణ్యత లోపం పేరుతో క్వింటాల్‌కు కేవలం రూ. 5,000 నుండి రూ.6,000 మాత్రమే ధర చెల్లిస్తూ రైతులను నష్టపరుస్తున్నారు.దళారులు, మిల్లు యజమానులు అధికారులతో కుమ్మక్కై రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, అదే పత్తిని తిరిగి సీసీఐకి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిసిఐ నిబంధనలు కేవలం రైతులకు మాత్రమే వర్తిస్తాయా అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు .అధిక వర్షాల కారణంగా ఈసారి పత్తి తీత ఆలస్యమైందని, అందువల్ల సిసిఐ కొనుగోళ్ల గడువును మార్చి నెలాఖరు వరకు పొడిగించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గడువు పెంచితేనే మిగిలిన పత్తిని మద్దతు ధరకు విక్రయించే అవకాశం ఉంటుందని కోరుతున్నారు. పత్తి రైతు భవిష్యత్తు మళ్లీ దళారుల చేతుల్లోకి వెళ్లడంపై గ్రామీణ ప్రాంతాల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.



## మాంబోజిపల్లి సంతలో ఐదు తులాల బంగారు చోరీ

### రూ. 8 లక్షల విలువ గల నగలు అపహరణ

**ప్రజాపక్షం/మెదక్ :** మాంబోజిపల్లి సంతలో 5 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కొల్చారంకు చెందిన చింతలగారి శ్రావణి ప్రవీణ్ భార్య భర్తలు మెదక్ వెళ్లి తిరిగి ప్రయాణంలో సంతలో కూరగాయ లు తీసుకోవడానికి వెళ్ళారు. తమ వద్ద ఉన్న హాండ్ బ్యాగులో ఉన్న రూ. 8 లక్ష ల విలువ గల 5 తులాల బంగారు నగలు నెక్లెస్ 2.5, నల్లపూసలు 2 తులలు, మాటిలు, చెవి కమ్మలు అర తులం చోరీ జరిగాయి. బాధితులు కొద్దిసేపటికి హాండ్ బ్యాగ్ చూడగా కనిపించకుండా పోవడంతో కంగుతిన్న బాధితులు మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.

## వసతి గృహంలో అపరిశుభ్ర ఆహారం

**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా సాయికుంటలోని బిసి ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్నా రని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు పురుగులు, రాళ్లు కలిసిన అన్నం, నీళ్ల పప్పు వడ్డిస్తున్నారని, వసతి గృహ వార్డెన్ విద్యార్థులతోనే వంట పనులు చేయిస్తూ కనీస పరిశుభ్రత పాటించడం లేదని ఆరోపించారు.

